బాబోయ్.. ఇవేం రోడ్లు



ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా డివిజన్ పరిధిలోని పలు ప్రధాన రహదారులపై గుంతలు ఏర్పడ్డాయి. రాత్రి సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారే కరువయ్యారు. దాంతో వాహనాదారులకు కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు. – జగద్గిరిగుట్ట

జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్‌లో ఇలా..



జగద్గిరినగర్ ప్రధాన రహదారిలో..



ఇందిరా గాంధీ విగ్రహం వద్ద..

కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు

నిజాంపేట్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. 125 డివిజన్ దేవేందర్ నగర్ డబుల్ బెడ్‌రూమ్ బీఆర్ఎస్ నాయకులు జగన్‌నాథ్, పి.శ్రీనివాస్, ఏ.సత్యనారాయణ, ఎస్.ప్రసాద్, నాగరాజు, విజయ్, డి.ఆనంద్ తదితరులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

నర్సరీల వద్ద రద్దీ..



జగద్గిరిగుట్ట: నిత్యం వర్షాలు కురుస్తుండటంతో నర్సరీలలో మొక్కల విక్రయాలకు క్రేజ్ పెరిగింది. చింతల్ నుంచి షాపూర్‌నగర్‌కు వెళ్లే దారిలో ఉన్న నర్సరీలలో పెద్దఎత్తున పూల మొక్కలను కొనుగోలు చేస్తున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న కార్పొరేటర్లు జగన్, సత్యనారాయణ

కుత్బుల్లాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరులో ఎమ్మెల్యే వివేకానంద్ చొరవతో పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుతున్నాయని కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ అన్నారు. చింతల్ బీఆర్ఎస్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని 140 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కేఎం గౌరీష్, సురేష్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ల అధ్యక్షుడు విజయరామిరెడ్డి, నాయకులు రుద్ర అశోక్, శంకరయ్య, పుప్పాల భాస్కర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి



సుభాష్‌నగర్: టీశాట్ వాల్యూ ఎడ్యుకేషన్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నైతికత, క్రమశిక్షణ పెంపొందుతాయని కుత్బుల్లాపూర్ మండల విద్యాధికారి జెమినికుమారి అన్నారు. నెహ్రూనగర్ స్కూల్‌లో విద్యార్థులకు టీశాట్ వాల్యూ ఎడ్యుకేషన్‌ను సోమవారం నిర్వహించారు. సమాజంలో ఎలా మెలగాలి, సమాజాభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

వాహనాల రాకపోకలకు అడ్డంకులు



పైప్‌లైన్ రోడ్డులో తాత్కాలిక ఫెన్సింగ్‌తో కల్వర్టు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట నుంచి షాపూర్‌నగర్ వరకు వెళ్లే పైప్‌లైన్ రోడ్డులో రూ.1.20 కోట్లతో ఇటీవలే కల్వర్టు పనులు పూర్తి చేశారు. దీంతో కొంత ట్రాఫిక్ సమస్య తగ్గినా ఇదే రోడ్డులో ఉన్న మరో రెండు కల్వర్టుల వద్ద నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. తాత్కాలిక ఫెన్సింగ్ వేశారు కానీ, దాంతో అంతగా ఉపయోగం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రతిరోజూ వందలాది వాహనాలు వెళ్లే ఈ దారిలో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కల్వర్టు కిందికి ఉండటం వరద రోడ్డుపై పారుతుండటంతో వాహనాల రాకపోకలకు అడ్డంకులు ఎదురవుతున్నాయి. అధికారులు స్పందించి కల్వర్టుల వద్ద విస్తరణ పనులు ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

ప్రజావాణిలో 11 ఫిర్యాదులు



గాజులరామారం ఉప కమిషనర్ మల్లారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ జగన్

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో నిర్వహించిన ప్రజావాణిలో 31 ఫిర్యాదులు అందాయి. కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహ అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో 20 ఫిర్యాదులు వచ్చినట్లు పేర్కొన్నారు. గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో 11 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. వీటిని సంబంధిత శాఖ అధికారులకు పంపినట్లు, వారం రోజుల్లో సమస్య తీవ్రతను గుర్తించి పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

ప్రైవేట్ స్కూళ్లకు నోటీసులపై..

గాజులరామారం సర్కిల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ప్రైవేటు స్కూళ్లలో ప్రతినిధులకు ఇటీవల నోటీసులు జారీ చేసి ట్రేడ్ లైసెన్స్ పేరిట పన్నులు చెల్లించాలని కోరగా కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, జగన్‌తో కలిసి ట్రస్మా స్కూల్ అసోసియేషన్ ప్రతినిధులు ఉప కమిషనర్ మల్లారెడ్డిని కలిసి విన్నవించారు. తమకు నోటీసులు జారీ చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. కోశాధికారి శ్రీకాంత్, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

దుండిగల్: 20 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. దుండిగల్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ నేతృత్వంలో పూర్వ విద్యార్థులంతా సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు వెంకట్‌రెడ్డి, తెలుగు పండిట్ సత్యనారాయణశర్మ, లెక్కల మాస్టర్ మురళి మోహన్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఆడిపాడి అంతా కలిసి భోజనాలు చేశారు. ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, జనార్దన్‌రెడ్డి, లక్ష్మి, పరిమళ, భారతలక్ష్మి ఆనందం వ్యక్తం చేశారు.

పింఛన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్ ఆందోళన



కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కుత్బుల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికల హామీలను అమలుచేయకుండా పింఛన్‌దారులను మోసం చేసిందని వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు సునీల్‌బాబు, వెంకటస్వామి ఆరోపించారు. కుత్బుల్లాపూర్, బాచుపల్లి మండల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట పింఛన్‌దారులతో కలిసి ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వికలాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, ఒంటరి మహిళలకు రూ.4వేల పింఛన్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 21 నెలలు పూర్తయినా అమలు చేయడం లేదని ఆరోపించారు. కొత్త పింఛన్లను సైతం విడుదల చేయడం లేదని, వెంటనే పింఛన్లు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్లకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సిలువేరు శ్రీనివాస్ మాదిగ, రాసమల్ల యాదగిరి మాదిగ, ఆరెకటిక జ్యోతి, డప్పు రామస్వామి, సలోమి, సరూప, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల కోసం టోకెన్లు



నిజాంపేట్: బతుకమ్మ పండుగ సందర్భంగా నిజాంపేట్ రాజీవ్ గృహకల్పలో నల్లమల్లిస్ ఆదర్శ మహిళ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, చైర్‌పర్సన్ నల్లమల్లి సామ్రాజ్యలక్ష్మి(రాధ) ఆధ్వర్యంలో వెయ్యి మందికి చీరలు పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా చీరల పంపిణీ కార్యక్రమం కోసం టోకెన్ల పంపిణీ సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి చేతులమీదుగా ఆవిష్కరించారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, స్రవంతి, పి.శశికళ, రాధిక, అనంతలక్ష్మి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు స్నాచర్లు రిమాండ్



సమావేశంలో స్నాచర్ల వివరాలు వెల్లడిస్తున్న మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి

కుత్బుల్లాపూర్: ఒంటరి మహిళలను టార్గెట్ చేసి చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ముఠా సభ్యులను పేట్‌బషీరాబాద్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సోమవారం పేట్‌బషీరాబాద్ ఏసీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి నిందితుల వివరాలను వెల్లడించారు. గుండ్లపోచంపల్లిలోని హనుమాన్‌గడ్డ శ్రీమేరు ఆస్పత్రి సమీపంలో నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ మెడలోంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు బంగారు గొలుసు తెంపుకుని పరారయ్యారు. అయితే సదరు మహిళ గట్టిగా గొలుసును పట్టుకోవడంతో సగం గొలుసు ఆమె చేతిలో ఉండిపోగా మిగతా నాలుగు తులాల గొలుసుతో స్నాచర్లు పరారయ్యారు. బాధితురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పేట్ బషీరాబాద్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా కండ్లకోయ ప్రాంతంలో ఢిల్లీకి చెందిన అజయ్‌శర్మ(25), రాహుల్ సక్సేనా(23), రాజేష్‌కుమార్(38), సాగర్‌రామ్ పాల్(25)ను అదుపులోకి తీసుకున్నారు. వీరు బోయిన్‌పల్లి పీఎస్ పరిధిలో ద్విచక్ర వాహనాల చోరీల కేసులో సైతం నిందితులుగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నాలుగు తులాల బంగారు గొలుసు, రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో పేట్‌బషీరాబాద్ ఏసీపీ బాలగంగిరెడ్డి, సీఐ విజయవర్ధన్, క్రైమ్ బ్రాంచ్ టీమ్ బృందం ఉన్నారు.

బాలిక ఆత్మహత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

దుండిగల్: బాలికపై లైంగిక దాడి చేయడంతో పాటు ఆమె ఆత్మహత్యకు కారకుడైన వ్యక్తికి మేడ్చల్ ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు జీవిత ఖైదు విధిస్తూ తీర్పునిచ్చింది. దుండిగల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భౌరంపేట్ ఇందిరమ్మ కాలనీకి చెందిన ఓ బాలికకు అదే కాలనీకి చెందిన ఎలక్ట్రిషియన్ శివకుమార్(33) మాయమాటలు చెప్పి లైంగికంగా లోబర్చుకున్నాడు. అంతే కాకుండా సదరు బాలికను వేధింపులకు గురి చేయడంతో 2018లో ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు శివకుమార్‌పై కేసు నమోదు చేశారు. సోమవారం మేడ్చల్ ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు జడ్జి అమరావతి తుది తీర్పును ఇచ్చారు. పోక్సో చట్టం కింద రూ.50వేల జరిమానా, 10 సంవత్సరాల కఠిన శిక్ష, మరో రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.

అంబేడ్కర్ భవన్ నిర్మించాలని వినతి



ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తూ..

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దళితులు, పేద, మధ్య తరగతి ప్రజల అవసరాల నిమిత్తం అంబేడ్కర్ భవన్ నిర్మించాలని సోమవారం దళిత హక్కుల పోరాట సమితి, భారత కమ్యూనిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దళిత హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఏసురత్నం మాట్లాడుతూ.. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో దాదాపు లక్షా యాభై వేల మంది ఎస్సీ ఉప కులాల ప్రజలు నివసిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఉన్న ఎస్సీ కులాల వారికి 1975లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సైలకు ఇచ్చిన ప్రభుత్వ భూములలో ఉన్న వారికి భూభారతిలో పట్టాపాస్ పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్లను దళితులందరికీ ఇవ్వాలని కోరారు. బాచుపల్లి మండలం పరిధిలో అనేక చోట్ల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతుందని, ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించి అంబేడ్కర్ భవనం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత నాయకులు బక్క మల్లేష్, సీపీఐ మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్, ఆశి యాదయ్య, పొన్నికంటి దస్తగిరి ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మెరుగైన వైద్యం



లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల అభ్యున్నతికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో పలువురు లబ్ధిదారులకు సోమవారం సీఎం రిలీఫ్ ఫండ్ పత్రాలను అందజేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జూల అండాలు, యార్లగడ్డ స్వరూపారాణి, అలియాబాద్ ప్రమీలకు రూ.2 లక్షలు విలువ పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు కొండంత అండ అని, సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజాపాలన ద్వారా పేదలకు అండగా నిలుస్తోందన్నారు. కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ఉన్నారు.

ఘనంగా సేవాలాల్ సేన ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరణలో నాయకులు

నిజాంపేట్: సేవాలాల్ సేన ఆవిర్భావ దశాబ్ది జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు సోమవారం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కేంద్రంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్ నాయక్ ఆధ్వర్యంలో ప్రగతినగర్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఆంగోత్ రాంబాబు నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం, రాజ్యాధికారం సాధనే లక్ష్యంగా దశాబ్ద కాలంగా లంబాడి, బంజారాల మనుగడ సాధనకై పోరాడుతున్న సంఘం సేవాలాల్‌సేన అన్నారు. రాష్ట్రంలో లంబాడిలకు జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలపై అలుపెరుగని పోరాటం చేస్తూ నేటికి పది సంవత్సరాలు కావొస్తోందన్నారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కేతావత్ హర్యా నాయక్, సాంస్కృతిక జాతీయ అధ్యక్షుడు ఎస్సీ నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాత్లావత్ రవినాయక్, భూక్యా రమేష్ నాయక్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రాజు నాయక్, ఉపాధ్యక్షులు వినోద్ నాయక్, ఎం.రాజు సభావాత్ కిషన్ నాయక్, బాలచందర్ నాయక్, సంతోష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లా.. చెరువులా..?

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పలు ప్రధాన రహదారుల్లో వరద చేరడంతో వాహనదారులు రాకపోకలకు సాగించేందుకు ఆటంకంగా మారింది. పలు కాలనీల్లోని ఇళ్లలోకి వరద చేరడంతో మోటార్లుతో బయటకు తోడేశారు. – కుత్బుల్లాపూర్



వైష్ణవి ఎన్‌క్లేవ్ ప్రధాన రోడ్డు



జీడిమెట్ల పైపులైన్ రోడ్డు



పైపులైన్ రోడ్డులో కోణార్క్ ఆస్పత్రి వద్ద



బాచుపల్లి ఆదిత్య గార్డెన్‌లో ఓ అపార్ట్‌మెంట్ సెల్లార్‌ను ముంచెత్తిన వరద



జీడిమెట్లలో ఓ అపార్ట్‌మెంట్ వద్ద వరద

పెన్షన్లు పెంచాలని నిరసన



నిజాంపేట్: పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ రాజీవ్‌గాంధీనగర్ అధ్యక్షుడు, దళితరత్న అవార్డు గ్రహీత ఎర్రోళ్ల యేసు ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. గుట్టలపల్లి నాగేష్, ఎర్రోళ్ల రామకృష్ణ, స్థానిక ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఈఎం, వీహెచ్‌పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.